ఈ ప్రశ్నకు బదులేది

-పెనుమాక నాగేశ్వరరావు

గత దశాబ్దకాలంగా అతన్ని గమనిస్తూనే వున్నాన్నేను. మతి స్థిమితం లేని మనిషి. అయినా మర్యాదగానే వ్యవహరిస్తాడు. తనలో తనే మాట్లాడుకోవడం, పోట్లాడుకోవటం, పెద్దపెద్దగా నవ్వుకోవడం... ఇవి అతన్ని మతి స్థిమితం లేని మనిషిగా గుర్తించడానికి ముఖ్యమైన ఉదాహరణలు.

ముతకవే అయినా మురికిగా మాత్రం వుండవ్ అతను వేసుకునే బట్టలు. వారానికి ఒక్కసారయినా గెడ్డం చేసుకుంటుంటాడు. చూసేందుకు వికారంగా గానీ, భయానకంగా గానీ వుండడు.

హోటళ్ల ముందు నిలబడి వచ్చేపోయే వాళ్లముందు చిరునవ్వుతో చేయి చాస్తాడు. రోడ్ల వెంట చెప్పులు లేకుండా తిరుగుతుంటాడు. రాత్రిపూట అతని మకాం ఎక్కడో, ఎండకీ, వానకీ ఎక్కడ తలదాచుకుంటాడో తెలీదు నాకు.

అతగాడి యాచనలో దేబెరింపూ వుండదూ, బెదిరింపూ వుండదు. అతని ముఖంలో నేను ఎప్పుడూ విచారంగానీ, సంతోషపు మెరుపుగానీ చూడలేదు. ఎప్పుడు చూసినా ఉదాసీనంగా, నిర్లిప్తంగా కనిపిస్తాడు.

ఇటీవలే అతగాడి పేరు బిక్షపతి అని మాత్రం తెలిసింది. డిగ్రీ పూర్తి చేయటంతో కావలసినంత తీరిక దొరికినట్లయ్యింది నాకు. అవకాశం చూసుకుని బిక్షపతితో మాట్లాడాలని కోరిక కలిగింది నాలో. అతడు పిచ్చివాడనే విషయం నిజమా కాదా అన్న సందేహం పట్టుకున్నది నాకు.

ఈమధ్య అతని ప్రవర్తనలో కొంతమార్పు కన్పించసాగింది. పిల్లల్ని భయపెట్టటం, రాళ్లు విసిరివేయడం, పెద్దపెద్దగా అరుచుకుంటూ, గాల్లో చేతులు వూపుకుంటూ నడవడం లాంటి చేష్టల్తో కన్పించాడు నాలుగయిదుసార్లు.

ఓ రోజు మెడలో పూలమాల చేసుకుని ఎడమచేతి పిడికిల్ని మైకులా నోటి ముందుంచుకుని ఏమిటేమిటో మాట్లాడుకుంటూ నడిచి వెళ్లటం చూశాను. అతని మాటలు అస్పష్టంగా వినిపించినై, అర్థరహితంగా వున్నయ్.

క్రితం రోజే మా ఏరియాలో ఓ రాజకీయ పార్టీ వారి బహిరంగ సభ జరిగింది. వూరువూరంతా పూలతోరణాలతో నిండిపోయింది. వీధులన్నీ విరితోటలైపోయినై. 'బహుశా బిక్షపతి ఓ దండ అక్కడ సంపాయించి వేసుకుని వుంటాడు. నిన్నటి రాజకీయ ఉపన్యాసం అతని ఈనాటి వేషధారణకు ప్రేరణ అయివుంటుంది'' అనుకున్నాను.

> **ఓ రోజు వీధి వాకిట్లో నిల్చున్నాను. కాసేపటికి బిక్షపతి దూరం నుంచి కన్పించాడు. మా ఇంటి ముందుకు రాగానే చప్పట్లు కొట్టాను. అతను విస్మయంగా నా వంక చూశాడు. రమ్మని చేతులూపేను. ఓ పిచ్చి నవ్వు నవ్వి అతడూ చప్పట్లు కొట్టాడు. నన్నే రమ్మని నేనూపినట్లే చేయి వూపి కొంచెం దూరం పరుగుతీశాడు.**

మరో రెండ్రోజులవరకూ అతడు ఆ వాడిన పూల దండ మెడలో వుంచుకునే తిరిగేడు.

పది సంవత్సరాలుగా పట్టించుకోని బిక్షపతిని గురించిన వివరాలు తెలుసుకోవాలన్న ఉబలాటం రోజు రోజుకు ఎక్కువ కాసాగింది నాలో. కొంత సమయం అందుకు కేటాయిస్తేనేగాని వివరాలు తెలుసుకోలేననుకున్నాను. వీలయినంత త్వరలో బిక్షపతి చరిత్రేమిటో తెలుసుకోవాలని స్థిర నిర్ణయానికి వచ్చేశాను.

★★★

బిక్షపతి అసలు వూరు ఏదో తెలియలేదు. అతని వాళ్లంటూ ఎవరూ మావూళ్లో లేరని తెలిసింది. రాత్రిళ్లు శివాలయంలో పడుకుంటుంటాడట. స్నానాది కార్యక్రమాలన్నీ అక్కడే పూర్తి చేసుకుంటాడట. పూజారి అప్పుడప్పుడు అందించే ప్రసాదాలు, గుడికి వచ్చే భక్తులు ఇచ్చే అరటిపండ్లు, కొబ్బరిముక్కలు ఆరగిస్తుంటాడట.

ప్రతిరోజూ, రెండు పూటలా ఆలయ ప్రాంగణమంతా చిమ్మి శుభ్రం చేస్తుంటాడట. ఎవర్తో మాట్లాడడట. ఎవరైనా ఏమైనా అడిగితే చిరునవ్వే బదులిచ్చి వెళ్లిపోతాడట. ఈమాత్రం విషయ సేకరణ చేయగలిగేను బిక్షపతిని కలుసుకోకముందే.

''ఇంత ప్రయత్నమూ చేస్తే, నేనేం అడిగినా అతగాడు సమాధానం చెప్పడేమో'' అనే సందేహం కలిగింది నాకు. అయినా సరే నా ప్రయత్నం నేను చేయదలుచుకున్నాను.

ఓ రోజు వీధి వాకిట్లో నిల్చున్నాను. కాసేపటికి బిక్షపతి దూరం నుంచి కన్పించాడు. మా ఇంటి ముందుకు రాగానే చప్పట్లు కొట్టాను. అతను విస్మయంగా నా వంక చూశాడు. రమ్మని చేతులూపేను.

ఓ పిచ్చి నవ్వు నవ్వి అతడూ చప్పట్లు కొట్టాడు. నన్నే రమ్మని నేనూపినట్లే చేయి వూపి కొంచెం దూరం పరుగు తీశాడు. నేను కోరుకున్నట్లు అతన్తో మాట్లాడటం అంత సులభం కాదేమో అనిపించింది.

★★★

ఓ వారం రోజులలా ఏవేవో వ్యాపకాల్తో గడిచిపోయినై. బిక్షపతి ధోరణిలో ఓ విచిత్రమైన మార్పు కన్పించసాగింది.

''అయామె లేకియర్..నేను లక్షాధికార్ని..లక్షా ఇర్వై వేల నగదు నా దగ్గరున్నట్టే...హ..హ్హ..'' అనుకుంటూ తిరుగుతున్నాడు. ఈ పరిణామం ఏమిటో ఎంతకీ అంతు చిక్కలేదు నాకు.

''పిచ్చివాడి మాటలకి ఇంతగా ఆలోచించటం అనవసరం'' అన్పించింది.

ఓ రోజు ఉదయాన్నే హోటల్‌కి వెళ్లాను.

హోటల్ గేటు దగ్గరే బిక్షపతి కన్పించాడు. నాతోపాటు లోపలికి రమ్మని సైగ చేశాను. మౌనంగా నన్ననుసరించాడతడు.

టిఫిన్ ఆర్డర్ ఇచ్చాను రెండు ప్లేట్లు. అటు తర్వాత మరో రెండు రకాలు కూడా తిన్నాడు బిక్షపతి.

''ఇంకేమైనా తీసు...''

నా మాటలు పూర్తికాకుండానే తల అడ్డంగా వూపేడు.

కాఫీ తెమ్మన్నాను సర్వర్‌తో.

అంతవరకూ నేనసలు బిక్షపతితో ఏమీ మాట్లాడలేదు. అతడు నా ఉనికినే మర్చిపోయినట్లు టిఫిన్ తినేశాడు.

కాఫీ తాగుతూ బిక్షపతి ముఖంలోకి నిశితంగా

చూశాను. ఆకలి తీరిన తృప్తి కన్పించింది నాకు అతని ముఖంలో.

బిల్ చెల్లించాను.

ఇద్దరం బయటకు నడిచాం.

★★★

''అలా వెళ్దాం పద'' అన్నాను జన సంచారం అంతగా వుండని ఓ రోడ్డు వంక చూపుతూ.

అర్ధం కానట్లు నా వంక చూశాడు.

పదమన్నట్లు తలాడించాను.

ఏమనుకున్నాడో అటుగా నడిచాడు నాతోపాటు.

''మీదేవూరు'' అడిగేను.

మాట్లాడలేదు.

''నీకు ఎవరూ లేరా?''

''......''

''ఏం మాట్లాడవా?''

''.....''

''ఈ మధ్యేంటి లక్షాధికార్ని, నాకు లక్షా ఇరవై వేలున్నయ్... అంటూ తిరుగుతున్నావ్...ఏమిటి విషయం''

''వాటీజ్ యువర్ నేమ్'' నా ప్రశ్నకు బదులుగా ప్రశ్నించాడు బిక్షపతి.

'ఈ పిచ్చివాడి బతుక్కి ఇంగ్లీషు కూడానా' అనుకుంటూ నా పేరు చెప్పేను.

''వాటీజ్ యువర్ క్వాలిఫికేషన్'' మరో ప్రశ్న.

'ఇతగాడు అందరనుకుంటున్నట్లు పిచ్చివాడు కాదు. కాస్తోకూస్తో చదువుకున్నట్లే వున్నాడు' మనసులోనే అనుకుని సమాధానం చెప్పేను.

''నేనడిగిన వాటికి సమాధానం చెప్పకుండా నా వివరాలన్నీ అడుగుతున్నావే'' అన్నాను చిరుకోపం ప్రదర్శిస్తూ

''నువ్వడిగిందానికి సమాధానం చెప్పటానికే సమాచారం సేకరిస్తున్నానూ'' అని పెద్దగా నవ్వేడు.

అతని మాటలు నాకు ఆసక్తి కలుగజేసినయ్. బిక్షపతి అడిగిన వాటన్నింటికీ సమాధానాలు చెప్పేందుకు సిద్ధపడ్డాను.

''డు యూ నో పాపులేషన్ ఆఫ్ ఇండియా..భారత దేశ జనాభా ఎంతో తెల్సా నీకు'' ఇంగ్లీషు, తెలుగు, రెండు భాషల్లోనూ ఒకే ప్రశ్న అడిగేడు ఓ తెలుగు సినిమా నటుడి ఫక్కీలో.

''తొంభై కోట్లనుకో'' అన్నాను.

''దెన్ యూ యాడ్ ఆల్ దీస్...
యూరియా కుంభకోణం......కోట్లు
పసుగ్రాసం కుంభకోణం......కోట్లు
చక్కెర కుంభకోణం......కోట్లు
సిమెంటు కుంభకోణం......కోట్లు
చింతపండు కుంభకోణం......కోట్లు
మిరపకాయలు
అల్లం
బెల్లం
షేర్లు.....వగైరా వగైరా కుంభకోణాలన్నింటిని ఏకరువుపెట్టాడు. అంతా కూడి తొంభై కోట్ల చేత భాగించమన్నాడు. ''అప్పుడు నావాటా లక్షా ఇరవై వేలు కాదా'' అనడిగి పెద్దగా నవ్వేశాడు.



అతని నవ్వు ఆపటం నా వల్ల కాలేదు.

అంతేకాదు బిక్షపతి ప్రశ్నకు నాకేం సమాధానం చెప్పాలో తోచలేదు. ఒక్కటి మాత్రం అనిపించింది బిక్షపతి పిచ్చివాడా? అని! ★

-పెనుమాక నాగేశ్వరరావు
కేరాఫ్ . బ్యాంక్ ఆఫ్ ఇండియా,
కొత్తపేట, గుంటూరు-1